

పడి పూజలో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అయ్యప్పస్వామి పడి పూజలో తలసాని

బేగంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని దాసారం బస్తీలో శ్రీనివాసన్, కృష్ణ, నవీన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, సనత్‌నగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు పుట్టల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పకు 108 కలశాల పూజ నిర్వహిస్తున్న అర్చకులు

అయ్యప్పకు 108 కలశాలతో అభిషేకం

బంజారాహిల్స్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో మండల పూజా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అయ్యప్పకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి హోమం అనంతరం స్వామివారికి కలశాభిషేకం, అర్చన పడిపూజ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జరిగిన పల్లకి సేవకు భారీ ఎత్తున అయ్యప్పదీక్షపరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు చీపిరి అర్జున్ యాదవ్, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ శర్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



శిల్పారామంలో నృత్య ప్రదర్శన

హైటెక్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం చిన్మయి నృత్యాలయ నాట్య గురువు శ్రీదేవి ముంగర శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. గణపతి తాళం, గురు అష్టకం, మూకాంబిక అష్టకం, అయిగిరి నందిని, చరిష్ణు, దేవాదేవం భజే అంశాలను హరిణి, తన్వి, అనూష, శ్రేష్ఠ, అభినయ, జాన్వి ప్రదర్శించి మెప్పించారు.



చిన్నారికి అవార్డు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు

కళలను ప్రోత్సహించాలి : బేగంపేట ఇన్‌స్పెక్టర్

బేగంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కళలను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతో ఉందని బేగంపేట ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. మయూరిమార్గ్‌లోని ద్వారకాదాస్ కాలనీలో ఆదివారం ప్రముఖ నృత్య కళాకారిణి స్వప్న సంతోస్ ఆధ్వర్యంలో ఇటీవల భరతనాట్యంపై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులకు ఆదివారం పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సైదులు, బేగంపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్‌లు కళాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రవీణ్ ఒకరియా, సతీష్ అగర్వాల్, కౌశల్, జయేష్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ప్రారంభం

బంజారాహిల్స్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు రాష్ట్రాల నుంచి చేనేతకారుల కళాత్మక ఉత్పత్తులైన సిల్క్, కాటన్ వస్త్రాలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని. చేనేతకారులను ప్రోత్సహించేలా ఇండియన్ సిల్క్‌గ్యాలరీ చేస్తున్న కృషి అభినందనీయమని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీజన అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన చేనేత ఎగ్జిబిషన్ ను ఆమె సందర్శించారు. నాణ్యమైన చేనేతవస్త్రాలను వినియోగదారులకు అందించడం శుభపరిణామమన్నారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

అంబేద్కర్‌కు నివాళులు

నిమ్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహాపరినిర్వాహణ దినోత్సవాన్ని ఆదివారం నిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈసందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీరప్ప మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ద్వారా మహిళలకు సమానహక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వర రావు , అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

గోషామహల్‌లో నకిలీ టూల్స్ గుట్టు రట్టు

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ ఇండస్ట్రియల్ టూల్స్ విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పక్కా సమాచారంతో సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, బేగంబజార్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడుల్లో లబ్ధి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో నిల్వ ఉంచిన నకిలీ కాన్వీ టీసీటీ సా బ్లేడ్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు దుకాణాలపై ఈ దాడులు చేపట్టారు. 2019 నుంచే లబ్ధి ఎంటర్‌ప్రైజెస్ కాన్వీ నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో కాన్వీ బ్రాండ్‌కు ఆర్థికంగా నష్టం కలగడంతో పాటు వినియోగదారుల భద్రతకు ముప్పు ఏర్పడిందని పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీటిని ల్యాబ్ పరీక్షలకు పంపించారు. దీని మూలాలు గుర్తించేందుకు, ఈ నెట్‌వర్క్ ఉన్న వారిని పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇండస్ట్రియల్ టూల్స్ నకిలీవి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిందేంది..?

అవినీతి, అప్పులు తప్ప అభివృద్ధి ఏదీ?

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న తెలంగాణ నాలెడ్జ్ సెంటర్, రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గోసుల శ్రీనివాస్ యాదవ్

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని పలువురు వక్తలు ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, అవినీతి, అప్పులు తప్ప అభివృద్ధి అనేదేమీ లేదని వారు మండిపడ్డారు. తెలంగాణ నాలెడ్జ్ సెంటర్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన- విజయాలు- వైఫల్యాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సెంటర్ డైరెక్టర్ గోసుల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లు వెంకటేశ్వర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, పల్లె రవికుమార్, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్ రెడ్డి, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రా, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు జక్కుల లక్ష్మణ్, ఆర్థికవేత్త పాపారావు, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, ఎల్.హెచ్.పీ.ఎస్ అధ్యక్షుడు రాంబల్ నాయక్, తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగం మీద రూ.18 వేల కోట్లు ఖర్చు పెడుతుండగా, తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారన్నారు. పిల్లల సమస్యలు ఆలోచించకుండా 2047 పై ఎలా ఆలోచిస్తారని విమర్శించారు. విద్యపై కమిషన్ వేశారు, కానీ ఆ నివేదికపై ఏమి చర్చించారని ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, ఫీజులు అరికట్టాలని, విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేసి, ప్రైవేట్ రంగాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. విద్య అనేది ప్రభుత్వ ఆధీనంలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో చేసిన సూచనలను ఒక నివేదిక రూపంలో సీఎంకు పంపుతామని నిర్వాహకులు వివరించారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



వ్యాయామశాల నిర్వాహకులతో ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించే విధంగా మరింత శ్రమించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ బల్కంపేటలోని శ్రీ హనుమాన్ వ్యాయామశాలకు చెందిన యువకులు, విద్యార్థులు ఇటీవల జరిగిన పోటీలలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆదివారం వ్యాయామశాల నిర్వాహకులు రాజు ఆధ్వర్యంలో వెస్ట్ మారేడ్ పల్లి క్యాంపు కార్యాలయంలో తలసానిని మర్యాద పూర్వకంగా కలిశారు. మెడల్స్ సాధించిన వారిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. తమ వ్యాయామశాలకు చెందిన వారు వివిధ విభాగాలలో మెడల్స్ సాధించారని, తలసానికి నిర్వాహకుడు రాజు వివరించారు. గత నెలలో జియాగూడలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీలలో 75 కిలోల విభాగం గోల్డ్ మెడల్, 70 కిలోల విభాగంలో బ్రాన్స్, సిల్వర్ మెడల్ అదేవిధంగా పవర్ లిఫ్టింగ్‌లో శ్రావణ్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించినట్లు వెల్లడించారు. మిగిలిన వారు బ్రాన్స్ మెడల్స్ సాధించారు. తమ వ్యాయామశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తూ, అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తూ క్రీడా కారులను ప్రోత్సహిస్తున్న తలసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, వనం శ్రీనివాస్, కట్టా బలరాం, హరి సింగ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలి

ఆర్మీ మేజర్ జనరల్ పునీత్ కపూర్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

బంజారాహిల్స్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో పాటు దేశభక్తితో కలిగి ఉంటే మంచి ఫలితాలు రావడంతో పాటు, సమాజానికి మంచి జరుగుతుందని డిప్యూటీ కమాండెంట్, ఆర్మీ మేజర్ జనరల్ పునీత్ కపూర్ అన్నారు. బంజారాహిల్స్ లోని మెరీడియన్ స్కూల్‌లో నిర్వహించిన పంచ భూత్ స్పోర్ట్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఫిట్‌నెస్ కాపాడుకోవడంతోపాటు, స్థిరమైన మనసు, మంచి అలవాట్లు విద్యార్థుల జీవితాలను మరింత ఉన్నతంగా మారుస్తాయన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలో ఉన్నా కూడా దేశం కోసం ఏదో ఒక మంచి పని చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చేసి న పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మెరీడియన్ విద్యా సంస్థల ఫౌండర్ బుట్టా రేణుక, ప్రిన్సిపాల్ పూనమ్ జా, వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో వీఎంసీ అద్భుత ఫలితాలు సాధించాలి : సతీష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ మాజీ చైర్మన్ డా.సతీష్ రెడ్డి

అమీర్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యామందిర్ క్లాసెస్ (వీఎంసీ) విద్యాబోధనలో అద్భుతమైన ఫలితాలు సాధించాలని డీఆర్డీఓ మాజీ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎయిరోస్పేస్, డిఫెన్స్ సలహాదారు డా.సతీష్ రెడ్డి అన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షల్లో తర్ఫీదుతో పాటు విద్యార్థులను గొప్ప ఇంజనీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో హైదరాబాద్ కేంద్రంగా విద్యా సంస్థ విద్యామందిర్ క్లాసెస్‌ను ప్రారంభించింది. 40 ఏళ్లుగా దేశానికి 20 వేల మంది ఐఐటియన్లు, డాక్టర్లను అందించిన అనుభవంతో హైదరాబాద్‌లో సేవలను విస్తరిస్తూ మాదాపూర్, సుచిత్రలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తో పాటు ఐఐటీ, నీట్ కోచింగ్ కేంద్రాలను లాంఛనంగా ఆదివారం అమీర్‌పేటలోని హోటల్ గ్రీన్ పార్క్‌లో సంస్థ కార్యకలాపాలను సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీఎంసీ కేవలం ఐఐటియన్స్, డాక్టర్లను తయారు చేయడమే కాకుండా విద్యాసంస్థలు దేశానికి అవసరమైన వృత్తి నిపుణులను తయారు చేయాలని పిలుపునిచ్చారు. తాను చదువుకునే రోజుల్లో కేవలం ఐఐటీ రామయ్య కోచింగ్ సెంటర్ మాత్రమే విద్యానగర్‌లో ఉండేదని అప్పటి రోజులను గుర్తుచేశారు.

భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మలిచేందుకు నిబద్ధత, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, కార్యదక్షత కలిగిన నిపుణులను అందించాలని సూచించారు. విద్యామందిర్ క్లాసెస్ సీఈఓ కౌశిక్ మిశ్రా మాట్లాడుతూ, 40 ఏళ్లుగా వీఎంసీ ఎదిగిన తీరును వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా వీఎంసీ వేలాది మంది విద్యార్థులు, తల్లితండ్రుల కలలను సాకారం చేస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా మాదాపూర్, సుచిత్రల్లో వీఎంసీ ఐఐటీ, జేఈఈ, నీట్‌తో ఇంటర్ విద్యను అందించనున్నట్లు వెల్లడించారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవాలు దానం



మధుసూదన్ (ఫైల్)

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది ఓ కుటుంబం. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా పిన్నాయిపల్లి గ్రామానికి చెందిన చింత చిన్ననర్సయ్య, సైదమ్మ దంపతుల రెండో కుమారుడు చింత మధుసూదన్ (35)కు భార్య జ్యోతి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో నగరంలోని లక్డీకపూల్‌లో నివాసముంటూ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు.

మధుసూదన్ కుమారులిద్దరూ యాదాద్రి- భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలోని మహాత్మాజ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. చిన్నకుమారుడికి జ్వరం వచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ గురువారం మధుసూదన్‌కు ఫోన్ చేయగా వెంటనే కుమారుడిని చూసేందుకు బయల్దేరాడు. ఈ క్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అదేరోజు కామినేని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. తలకు తీవ్రంగా గాయాలై బ్రెయిన్‌డెడ్ కావడంతో మధుసూదన్ ఆదివారం ఉదయం మృతిచెందారు. వైద్యబృందం అవయవదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు సుముఖత తెలపడంతో మధుసూదన్ కాలేయం, కిడ్నీలు, కంటి కార్నియాలు దానం చేశారు.



పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఐపీఎస్ అధికారి సంజయ్ కుమార్ జైన్, కమాండెంట్ మురళీకృష్ణ, నిర్వాహకులు



వేదికపై ఆకట్టుకున్న 'షీ'స్ ఇండియా పోటీ మహిళలు

ఆకట్టుకున్న 'షీ'స్ ఇండియా' పోటీలు

యూసుఫ్ గూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళల శక్తి సామర్థ్యాలను చాటి చెప్పడమే లక్ష్యంగా యూసుఫ్‌గూడలో ఉన్న శౌర్య కన్వెన్షన్ సెంటర్‌లో 'షీ'స్ ఇండియా' పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ఆదివారం జరిగాయి. ఈ పోటీలను ఐపీఎస్ అధికారి సంజయ్ కుమార్ జైన్, మొదటి బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీలకు ఎత్తు, బరువు వంటి అర్హతలు లేవు. దేశ నలుమూలల నుంచి 18 నుంచి 81 ఏళ్ల అత్యున్నతమైన 20 ఫైనలిస్టులు విచ్చేశారు. గృహిణుల నుంచి ఏరోనాటికల్ ఇంజినీర్లు, స్కూల్ టీచర్లు నుంచి నర్సులు, ఫ్యాషన్ ఇండస్ట్రీ నుంచి కార్పొరేట్ ఐకాన్ల వరకు అందరూ ఒక వేదికపై కలిసి వాక్ చేశారు. మహిళల శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని, సమాజానికి చేసిన సేవలను ఈ వేదికపై ఘనంగా జరుపుకున్నారు. ఈ గ్రాండ్ గాలా ఫినాలేలో గెలుపొందిన మహారాణులకు కిరీటధారులను సత్కరించి అభినందించారు. పోటీదారుల హృదయాన్ని కదిలించే కథలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన పుట్‌థంపింగ్ సంగీతం అలరించింది. మోహనా హవాయియన్ రౌండ్ నుంచి మహారాణి రౌండ్, గ్రాండ్ క్రౌనింగ్ ముందు జరిగే ప్రశ్న, జవాబు రౌండ్ వరకు ఎంతో ఉత్కంఠతను రేకెత్తించాయి.

పది మంది జ్యూరీ సభ్యులు, అతిథులు, 'షీ'స్ ఇండియా కుటుంబంలోని సుమారు 200 నుంచి 300 మంది కుటుంబ సభ్యులు హాజరయ్యారు. డ్రీమ్‌ఫోక్స్ సహకారం అందించింది.



అయ్యప్ప మండల పూజలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్వాములు

వైభవంగా అయ్యప్ప మండల పూజలు

వెంగళరావునగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలోని అయ్యప్ప మైదానంలో శ్రీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో 31వ మండల పూజా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాత సేవ, శ్రీ మహాగణపతి హోమంతో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ అయ్యప్ప స్వామి వార్లకు అర్చన, 10 గంటలకు శ్రీ అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అమీర్‌పేట్ శ్రీ బాలమణికంఠ భక్త సమాజంచే భజన, మధ్యాహ్నం 12.30కు మహా పడిపూజ, అనంతరం అన్నసంతర్పణ జరిగింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్, దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, కాలనీ అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ధనుంజయ రెడ్డి, రాజశేఖర్, హనుమంతరావు యాదవ్, సమితి ప్రతినిధులు, అయ్యప్పస్వాములు అనిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి రథోత్సవం, హరివరాసనం తదితర కార్యక్రమాలలో కాలనీవాసులు పాల్గొన్నారు.

యువభారతి సేవలు అనిర్వచనీయం : ఆచార్య ఎల్లూరి

ఖైరతాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యం గురించి తెలుసుకోవాలంటే యువభారతి ప్రచురించిన గ్రంథాలు చదివితే సరిపోతుందని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. నగరంలోని పలు సాహిత్య సంస్థలతో కలిసి యువభారతి తెలుగు వెలుగు సమాఖ్యగా ఏర్పడి ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఐఐఎంసీ కళాశాలలో కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు భాషా సాహిత్యాల కోసం యువభారతి చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి యువభారతి వ్యవస్థాపక సమావేశకర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ పద్యకవి డాక్టర్ రాజశ్రీ రచించిన నల్లగుట్ట శ్రీహరి కూర్మనాథ స్వామి శతకాన్ని శివారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల పూర్వ ఆచార్యులు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గయోపాఖ్యానం నాటిక వైశిష్ట్యాన్ని గురించి ప్రసంగించారు. డాక్టర్ రాధశ్రీ కావ్యాన్ని గురించి యువభారతి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర సమీక్షించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు ప్రచురితం కాని దాశరథి కృష్ణమాచార్య రచనలను త్వరలో యువభారతి ప్రచురణగా తీసుకు రానున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన నరసింహాచార్య, కేవీఎస్ ఆచార్య, యువభారతి కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, సాహితీవేత్త చీకోలు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్.

ఎస్పీ బాలు విగ్రహం ఇక్కడెందుకు?

తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టడం తెలంగాణపై దాడి చేయడమేనని 'తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్ అన్నారు. ఏపీలో ఒక్క తెలంగాణ యోధుడి విగ్రహం ఉందా.. మరి అక్కడ లేని విగ్రహాలు ఇక్కడెందుకని ఆయన ప్రశ్నించారు. మిలియన్ మార్చ్ తరహాలో వారి విగ్రహాలు తొలగించే మార్చ్ చేపడుతామని, వాటిని తొలగించి ఆంధ్రా సరిహద్దులో పెడతామని హెచ్చరించారు. తెలంగాణ క్రాంతి దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమైక్యవాదుల విగ్రహాలా? తెలంగాణ యోధుల విగ్రహాలా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విద్యార్థి సంఘాల నాయకులు దేవకీ దేవి, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సురేందర్ రాజు, నారాయణ రెడ్డి, జర్నలిస్ట్ పాశం యాదగిరి, నటుడు, దర్శకుడు రఫీ, సినీ దర్శకుడు ప్రేమ్ రాజ్, తెలంగాణ సినిమా వేదిక ప్రతినిధులు టి.ప్రఫుల్ రాంరెడ్డి, తదితరులు పాల్గొని ప్రసంగించారు.



ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలే లక్ష్మణ్, బి.నర్సింగ్‌రావు తదితరులు

కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబడుతుంది

ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు

బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆనాడు నాటకం కళారూపకంగా నిలబడగా నేడు కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబడుతుందని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. సాహిత్యంలో కవిత్వం భాగమైనప్పుడు నిగూఢత లేకపోతే అది నిలబడలేదన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పసునూరు శ్రీధర్‌బాబు రచించిన ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ, కవిత్వం ఒక వ్యసనం వంటిదని, అందులో దిగిన వారు బయటకు రావడం కష్టమన్నారు. కళాత్మకమైన విలువలు తెలిసిన కవి శ్రీధర్‌బాబు అని కొనియాడారు. తెలుగులో కవిత్వం రాసేవారు చాలా మంది ఉన్నారని, వారు బయటి ప్రపంచాన్ని పట్టించుకోరని అన్నారు. తెలంగాణ అస్తిత్వ ధోరణిలో వస్తున్న కవితలో శ్రీధర్‌బాబుది డిఫరెంట్ ధోరణి అని భిన్నమైన శైలిలో కవిత్వాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ మాట్లాడుతూ, అద్భుతమైన కవిత్వాన్ని సమాజానికి అందించారని అన్నారు. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ, న్యాయవాదిగా కొనసాగడం ఇష్టం లేక రచనలపై ఆసక్తితో జర్నలిజంలోకి శ్రీధర్‌బాబు అడుగుపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రచయిత్రి విమల, రచయిత సిద్ధార్థ, కవి ప్రసాదమూర్తి, పసునూరు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కనకం శ్యాంను సన్మానిస్తున్న బస్తీ వాసులు

జ్ఞానిజైల్ సింగ్ నగర్ బస్తీ అధ్యక్షుడిగా కనకం శ్యాం

బంజారాహిల్స్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్ నగర్ బస్తీ ఎన్నికలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికల్లో బస్తీకి చెందిన కనకం శ్యాం 110 ఓట్లతో గెలుపొందారు. రెండో స్థానంలో పద్మ 79 ఓట్లు, పోతుల మల్లేష్ 58, డాన్ రాజు 47 ఓట్లు, సలీం 16 ఓట్లు, సత్యనారాయణలకు 12 ఓట్లు వచ్చాయి. మొత్తం 357 ఓట్లకుగాను 325 ఓట్లు పోలయ్యాయి. గెలుపొందిన కనకం శ్యాంను బస్తీవాసులు సత్కరించారు. బస్తీకి చెందిన రామచంద్రయ్య ఎన్నికల నిర్వహణ అధికారిగా వ్యవహరించారు. త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని ప్రకటిస్తామని శ్యాం తెలిపారు.



ప్రారంభోత్సవంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి బంజారానగర్ పార్కులో ఏర్పాటు చేసిన ఉమెన్స్ మేళాను ఆదివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలు తమ ఇంటి వద్ద తయారుచేసిన పలు రకాల వస్తువులు, వంటలు, గృహోపకరణాలను వారే మార్కెటింగ్ చేసుకోవడానికి ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం కోసం నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని, మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఉమెన్స్ మేళా ఆర్గనైజర్లు యశోద, రీతు, రచన, వేణుగోపాల్ రావు, నరసింహ, బోస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి : తలసాని

మారేడుపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థులు రాణించేవిధంగా మరింత శ్రమించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నవంబరులో జియాగూడలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో హనుమాన్ వ్యాయామశాలకు చెందిన మణికంఠ 75 కిలోల విభాగం గోల్డ్ మెడల్, 70 కిలోల విభాగంలో బన్నీ సిల్వర్ మెడల్, పవర్ లిఫ్టింగ్‌లో శ్రవణ్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం వ్యాయామశాల నిర్వాహకులు రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మెడల్స్ సాధించిన వారిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

● ఎల్‌ఓసీ పత్రాల అందజేత

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలనసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం విడుదల కాగా మంజూరు పత్రాల(ఎల్‌ఓసీ)ను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

అయ్యప్పస్వామి పడి పూజలో తలసాని

బేగంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని దాసారం బస్తీలో శ్రీనివాసన్, కృష్ణ, నవీన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, సనత్‌నగర్ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు పుట్టల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి అవార్డు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు


కళలను ప్రోత్సహించాలి : బేగంపేట ఇన్‌స్పెక్టర్

బేగంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కళలను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతో ఉందని బేగంపేట ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. మయూరిమార్గ్‌లోని ద్వారకాదాస్ కాలనీలో ఆదివారం ప్రముఖ నృత్య కళాకారిణి స్వప్న సంతోస్ ఆధ్వర్యంలో ఇటీవల భరతనాట్యంపై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులకు ఆదివారం పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సైదులు, బేగంపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్‌లు కళాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రవీణ్ ఒకరియా, సతీష్ అగర్వాల్, కౌశల్, జయేష్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బోయినపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానసిక పరిస్థితి సరిగ్గా లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బోయినపల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం డాక్టర్ వై.హరిణి భర్త గిరి ప్రశాంత్ మానసిక స్థితి సరిగ్గా లేక, ఆవేదనతో ఇంటి నుంచి బయలు దేరాడు. అతడిని బీహెచ్‌ఈఎల్ సీఎంఆర్ మాల్ వరకు, అనంతరం అతడు ఎక్కిన ఆర్‌టీసీ బస్సులో ఎక్కి బోయినపల్లి వరకు ప్రయాణించడం వరకు కుటుంబ సభ్యులు అనుసరించారు. అక్కడ బస్సు దిగి న్యూ బోయినపల్లి సిగ్నల్ సమీపంలో అతడు కనిపించకుండా పోయాడు. దీంతో వారు అన్ని ప్రదేశాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



భరత్ సింహరాజు

బోయినపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటనలో మృతి చెందిన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివశంకర్ వివరాల ప్రకారం బల్కంపేట్ నివాసి గురుజా భరత్ సింహరాజు(41) గొడవల కారణంగా విడిపోయి భార్యకు దూరంగా ఉంటూ ఓ పూజా స్టోర్‌లో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని ముగించుకుని నడుచుకుంటూ బోయినపల్లి ఎయిర్ ఫోర్స్‌స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలపై, ఇతర శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రోడ్డుపై ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. తన కొడుకు మరణానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లి కస్తూరి గిరిజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్‌ను దూషించిన వ్యక్తి రిమాండ్

రాంగోపాల్‌పేట్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో అసభ్యంగా మాట్లాడడమే కాకుండా, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని మహంకాళి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్, ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మహేష్ పార్క్‌లేన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా పికెట్‌కు చెందిన చందు వెంకటరమణ నాయుడు మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చాడు. ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న కానిస్టేబుల్‌తో గొడవపెట్టుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా అతడిపై చేయి చేసుకున్నాడు. అంతేకాక తన ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి తన వాహనానికి నిప్పు పెట్టి రోడ్డుపై ఉన్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఆదివారం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా జడ్జి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఎవరైనా దురుసుగా వ్యవహరించి, వారి విధులకు ఆటంకం కలిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఉపేక్షించేది లేదన్నారు.

సీసీ రోడ్డు వేయండి



ఆర్‌ఆర్‌సీ మైదానం నుంచి రైల్ నిలయం వైపు వెళ్లే మట్టి రోడ్డు మార్గం

- అడ్డగుట్ట ఆర్‌ఆర్‌సీ మైదానం ప్రాంత వాసులకు బస్టాపు దూరం
- సికింద్రాబాద్ వెళ్లాలంటే చుట్టూ తిరగాల్సిందే
- సరైన దారి లేక ఇబ్బందుల్లో స్థానికులు
- కొన్నేళ్లుగా పట్టించుకోని అధికారులు

అడ్డగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట ఆర్‌ఆర్‌సీ మైదానం ప్రాంత వాసులకు బస్టాపు, సికింద్రాబాద్ వైపు వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌ఆర్‌సీ మైదానం మట్టిరోడ్డు మార్గంలో వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ మట్టి రోడ్డు నుంచి పహాడి హనుమాన్ ఆలయం వైపు వరకు సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ రోడ్డు వేస్తే మెట్టుగూడ, ఆలుగడ్డబావి, రైల్ నిలయం, సికింద్రాబాద్ వైపునకు వెళ్లడానికి దూరం తగ్గుతుంది. లేదంటే తుకారాంగేట్ చౌరస్తా, అడ్డగుట్ట మీదుగా సికింద్రాబాద్, మెట్టుగూడ వైపునకు రెండు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో సాయంత్రం ఏడు గంటలు అయితే చాలు చీకటి భయంతో స్థానికులు బయటికి రావడంలేదు. ఆర్‌ఆర్‌సీ మైదానం నుంచి తుకారాంగేట్, అడ్డగుట్టకు వెళ్లాలంటే గల్లీల్లో నడుచుకుంటూ మట్టి కుప్పలు, కంకర తేలినరాళ్ల మధ్య ప్రయాణం చేయాల్సి వస్తుంది. అలాగే ఈ ప్రాంతం నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు కేవలం రెండు కిలోమీటర్ల దూరమే. కానీ సరైన దారి లేక ఈస్ట్‌మారేడుపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మట్టి రోడ్డును చదును చేసి సీసీ రోడ్డు వేస్తే ఒక వైపు సికింద్రాబాద్ మరోవైపు మెట్టుగూడ, రైల్ నిలయం ఆలుగడ్డ గాంధీ ఆస్పత్రికి ఐదు నిమిషాల్లో చేరుకోవచ్చు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న పద్మారావు, మాజీ ఎమ్మెల్యే జయసుధల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చినా ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు. ఆరేళ్ల క్రితం స్థానికులందరూ కలిసి కేవలం దారి కోసం మట్టి రోడ్డు వేసుకున్నారు. ప్రస్తుతం ఈ మట్టి రోడ్డులో పిచ్చిమొక్కలు మొలవడం, రాత్రి సమయాల్లో పాములు సంచరిస్తుండటంతో బయటకు వెళ్లడం కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

ఓట్ల కోసం వస్తే సమస్య చెప్పుకున్నాం

ఎన్నికల ప్రచారానికి వచ్చే నేతలకు రోడ్డు వేయాలని స్థానికులు పలుమార్లు విన్నవించుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పద్మారావుకు కూడా అనేకసార్లు సమస్యను తెలియచేశారు. పదేళ్ల కావస్తున్నా సమస్య మాత్రం తీరడంలేదు. ఇప్పటికైనా ఇక్కడ సీసీ రోడ్డు లేదంటే డాంబర్ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రయితే భయం



చెట్లపొదల నుంచి పాములు బస్తీలోకి రావడంతో ఈ ప్రాంత వాసులు రాత్రి అయిదంటే భయానికి గురవుతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదు. అనేకసార్లు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. వెంటనే సీసీ రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - కేఎస్ సుధాకర్, బస్తీవాసి

రోడ్డు వేయండి



మట్టి రోడ్డును చదును చేసి సీసీ వేస్తే తుకారాగేట్, అడ్డగుట్ట ప్రాంతాల్లో ఉదయం సాయంత్ర వేళలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే మరాఠ బస్తీ నుంచి లేదంటే ఈ మట్టి రోడ్డు మీది నుంచి వెళ్లాలి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి సీసీ రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - భూపతి హరి, ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్

కంటోన్మెంట్‌లో సమస్యలు పరిష్కరిస్తా



బోర్‌వెల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు ఐదవ వార్డు పరిధిలోని బస్తీల్లో ఎమ్మెల్యే శ్రీగణేశ్ నాయకులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కంటోన్మెంట్‌లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. అలాగే తాగునీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న కిందిబస్తీలో స్టేట్ గవర్నమెంట్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో ఇటీవల వేయించి నూతన బోర్‌వెల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం బస్తీవాసులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన కమ్యూనిటీ హాల్, సిమెంట్ రోడ్డు నిర్మాణం, నూతన బోర్ వెల్స్ పనులు చేయిస్తానని చెప్పారు. నాయకులు సంకి రవీందర్, నాగేందర్, సతీష్, సంతోష్, భిక్షపతి, విష్ణు, సాయి, శ్యామల, రజనీ, అశోక్, బాలకృష్ణ, అరవింద్ ఉన్నారు.

ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి కృషి

బోయినపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి ముదిరాజ్ సంఘం నూతన కమిటీ పరిచయ కార్యక్రమం ఆదివారం చిన్నతోకట్టలోని ఎంఆర్ బాంకెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ పరిచయ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, జాయింట్ సెక్రటరీ సంజీవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి గోవింద్, ట్రెజరర్ రవీందర్‌లతోపాటు సభ్యులందరికి ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని, వారు స్థలం సమకూర్చుకుంటే ముదిరాజ్ భవన నిర్మాణం చేయిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి మధుకర్, పిట్ల నగేష్, ముదిరాజ్ సంఘం చైర్మన్ వేణుగోపాల్, సలహాదారులు సత్తయ్య, జగత్ రామ్, అశోక్ కుమార్, మారుతి గౌడ్, ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్క్ వద్ద బీజేపీ నాయకుల ధర్నా



ధర్నాకు తరలివెళుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బౌద్ధనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో, గ్యారంటీలను నెరవేర్చకుండా కాలాయాపన చేస్తున్నందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం తలపెట్టిన మహాధర్నాకు బౌద్ధనగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, నాయకులు సత్యనారాయణ, దత్తు, లడ్డు, నాగరాజు, నర్సింగ్‌కుమార్, రాజు, సుశీల, నాగమణి సంపత్ పాల్గొన్నారు.

ఈశ్వరాచారి ఆత్మబలిదానం బాధాకరం

● కొవ్వొత్తుల ర్యాలీలో బహుజన కులాల ఐక్యవేదిక



సాయి ఈశ్వరాచారి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బహుజన కులాల ఐక్యవేదిక ప్రతినిధులు

మల్కాజిగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మబలిదానాలు మంచిది కాదని పోరాటాల ద్వారానే బీసీ రిజర్వేషన్లను సాధించుకుందామని ఇకపై ఎవరూ ఆత్మబలిదానాలకు పాల్పడరాదని బహుజన కులాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు పై సాయి ఈశ్వరాచారి ఆత్మబలిదానాన్ని నిరసిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వినాయక్‌నగర్ డివిజన్‌లో బహుజన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంతోషిమాత ఆలయం నుంచి వినాయక్‌నగర్ చౌరస్తా ఈశ్వరాచారి అమర్ హై అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు ఇప్పటికైన చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రతినిధులు పూలపల్లి సుందర్‌యాదవ్, కాసర్ల నాగరాజు, జీడి నవీన్‌గౌడ్, పిట్టల భాస్కర్, ఉడుత నవీన్, జోగుశ్రీనివాస్, చిందం హరి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ పెంపుకోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఈశ్వరాచారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.మూడు కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఆయన పిల్లల చదువుల ఖర్చులను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ ఎంపీలు బిల్లుపై మాట్లాడాలన్నారు. ఈశ్వర్ చారి ప్రాణ త్యాగంతోనైనా కేంద్రం బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవాలు దానం



చింత మధుసూదన్ (ఫైల్)

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది ఓ కుటుంబం. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా పిన్నాయిపల్లి గ్రామానికి చెందిన చింత చిన్ననర్సయ్య, సైదమ్మ దంపతుల రెండో కుమారుడు చింత మధుసూదన్(35)కు భార్య జ్యోతి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో నగరంలోని లక్డీకపూల్‌లో నివాసముంటూ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మధుసూదన్ కుమారులిద్దరూ యాదాద్రి-భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలోని మహాత్మాజ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. చిన్నకుమారుడికి జ్వరం వచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ గురువారం మధుసూదన్‌కు ఫోన్ చేయగా వెంటనే కుమారుడిని చూసేందుకు బయల్దేరాడు. ఈ క్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అదేరోజు కామినేని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. తలకు తీవ్రంగా గాయాలై బ్రెయిన్‌డెడ్ కావడంతో మధుసూదన్ ఆదివారం ఉదయం మృతిచెందారు. వైద్యబృందం అవయవదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు సుముఖత తెలపడంతో మధుసూదన్ కాలేయం, కిడ్నీలు, కంటి కార్నియాలు దానం చేశారు.

కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబడుతుంది

ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు



ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలే లక్ష్మణ్, బి.నర్సింగ్‌రావు తదితరులు

బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆనాడు నాటకం కళారూపకంగా నిలబడగా నేడు కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబడుతుందని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. సాహిత్యంలో కవిత్వం భాగమైనప్పుడు నిగూఢత లేకపోతే అది నిలబడలేదన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పసునూరు శ్రీధర్‌బాబు రచించిన ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ, కవిత్వం ఒక వ్యసనం వంటిదని, అందులో దిగిన వారు బయటకు రావడం కష్టమన్నారు. కళాత్మకమైన విలువలు తెలిసిన కవి శ్రీధర్‌బాబు అని కొనియాడారు. తెలుగులో కవిత్వం రాసేవారు చాలా మంది ఉన్నారని, వారు బయటి ప్రపంచాన్ని పట్టించుకోరని అన్నారు. తెలంగాణ అస్తిత్వ ధోరణిలో వస్తున్న కవితలో శ్రీధర్‌బాబుది డిఫరెంట్ ధోరణి అని భిన్నమైన శైలిలో కవిత్వాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ మాట్లాడుతూ, అద్భుతమైన కవిత్వాన్ని సమాజానికి అందించారని అన్నారు. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ, న్యాయవాదిగా కొనసాగడం ఇష్టం లేక రచనలపై ఆసక్తితో జర్నలిజంలోకి శ్రీధర్ బాబు అడుగుపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రచయిత్రి విమల, రచయిత సిద్ధార్థ, కవి ప్రసాదమూర్తి, పసునూరు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేత

ఉద్యమకారుల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న చిలకలగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి మల్లారి అనిల్‌కుమార్ తదితరులు. - బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



పూజా గదిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దంపతులు

ఆలయంలో పూజగదిని ప్రారంభించిన కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం సికింద్రాబాద్ ఓల్డ్ గాస్మండిలోని ఉప్పలమ్మదేవి ఆలయనూతన పూజగదిని ఆలయ పూజారి మంత్రోచ్చారణల మధ్య రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర సత్యనారాయణ(శ్రీకాంత్)తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ గదిని నిర్మించారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా సహ కోశాధికారి ఎస్ఆర్ మల్లేష్, అధికార ప్రతినిధి భైరిశెట్టి అశ్విని, నాయకులు మదన్, శ్రీధర్, శ్రీనివాస్ యాదవ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వారాసిగూడలో ఆదివారం డాక్టర్ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక ప్రజలు పాల్గొని పరీక్షలను చేయించుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతినెల మొదటి, చివరి ఆదివారాల్లో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శరత్‌చంద్ర, నందిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

మన విధిని మనమే రూపొందించుకోవాలి



మాట్లాడుతున్న దీదీ కృష్ణ కుమారి

బోయినపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మన విధిని మనమే రూపొందించుకోవాలని, అందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రపంచ మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు సాధు వాస్వానీ మిషన్ గ్లోబల్ అధిపతి దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ సందర్శించిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సాధు వాస్వానీ మిషన్ సాధు వాస్వానీ విద్యాలయాలు సంయుక్తంగా ఆదివారం సికింద్రాబాద్ సిఖ్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో 'మీ విధిని రూపొందించండి - మీ మార్గాన్ని ఎవరు రూపొందిస్తారు? మీరు చేస్తారు' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. ఆద్యంతం ఆలోచనలకు దారి తీసే మన గమ్యం ముందే రాయబడింది కాదని, మనమే ప్రతి రోజు మనం తీసుకునే నిర్ణయాలతో దాన్ని నిర్మించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంఆణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మిర్చందాని, హీరా రూపానీ, హరి సాధ్వని, తరుణ్ దహిర్వేద్వాని పాల్గొన్నారు.



అల్పాహారం అందజేత

మారేడుపల్లి నెహ్రూనగర్ పార్కు వద్ద గోవింద్ శాంతి బెంజ్ రాజు సొసైటీ చైర్మన్ రమేష్ బెంజ్ రాజు ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉదయం 250 మందికి అల్పాహారం సేవా కార్యక్రమంలో భాగంగా అల్పాహారం అందజేస్తున్నారు. - మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి

గ్లోబల్ సమ్మిట్‌కు డా. ఎల్లారెడ్డికి ఆహ్వానం



ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైసింగ్ విజన్-2047 గ్లోబల్ సమ్మిట్‌కు సఫల ఆర్గానిక్ కంపెనీ సీఈఓ డా. పైడి ఎల్లారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికింది. ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్న ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌లో దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు, ప్రతినిధులు, మేధావులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ బృహత్ కార్యక్రమానికి డా.ఎల్లారెడ్డి ఆహ్వానం పొందడం స్నేహితులు, కుటుంబ సభ్యులు, సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.